క్లుప్తంగా

బ్యాంకు ఆఫ్ బరోడా వార్షికోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి, శ్రీరంగపట్నం, గాదరాడ గ్రామాల్లోని బ్యాంకు ఆఫ్ బరోడా శాఖల్లో గురువారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బూరుగుపూడిలో మేనేజర్ జె.సురేష్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మహారాజ సయాజీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బూరుగుపూడి హైస్కూల్లో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాతాదారులు, జాయింట్ మేనేజర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత బ్యాంకు వ్యవస్థాపకుడు సయాజీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ కె.భాస్కర్ కేక్ కట్ చేసి సిబ్బందికి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బ్యాంకు జాయింట్ మేనేజర్ వి.వాసు, క్రెడిట్ ఆఫీసర్ ధృవకుమార్‌రెడ్డి, సిబ్బంది నేరయ్య, బంగారి, డి.రవికుమార్, యానిమేటర్లు, డ్వాక్రా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం 150 మంది పేదలకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి దాత తాళ్లపూడికి చెందిన తాటికొండ అమ్మిరాజు సహకారం అందించారు. సేవా సమితి సభ్యులు నిరుపేదల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

ఎఫ్‌సీఐ సలహా కమిటీ రాష్ట్ర సభ్యుడిగా త్రినాథరెడ్డి


సత్తి త్రినాథరెడ్డి

అనపర్తి: భారత ప్రభుత్వ ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సలహా కమిటీ రాష్ట్ర సభ్యుడిగా సత్తి త్రినాథరెడ్డి నియమితులయ్యారు. ఈ విషయాన్ని గురువారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఆయన విలేకరులకు తెలిపారు. పౌల్ట్రీ వ్యాపార నిమిత్తం కర్ణాటక రాష్ట్రంలో అనపర్తికి చెందిన త్రినాథరెడ్డి స్థిరపడ్డారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల్లో తన వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన త్రినాథరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణ రెడ్డి, వర్తక సంఘ అధ్యక్షుడు సత్తి వెంకట రామారెడ్డి, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లిమోహన్‌రెడ్డి, ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘ మాజీ అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నేషనల్ వెంకటరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, గ్రామ ప్రముఖులు కర్రి ఎర్రబ్బు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి దొరబాబు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

కేరళ బృందం పర్యటన


కోరుకొండ పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కేరళ బృందం

మధురపూడి: కేరళలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఇండియా వైద్యబృందం గురువారం కోరుకొండ పీహెచ్‌సీ, కణుపూరు, రాజవరం గ్రామాలను సందర్శించింది. కోరుకొండ పీహెచ్‌సీ భవనంలో రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కణుపూరు, రాజవరం గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలను అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ బృందంలో డాక్టర్ రాజేష్ జె.నాయర్, మాథ్యూ ఎంసీలతో పాటు జిల్లాకు చెందిన వైద్యాధికారులు అభిషేక్, సుధీర్, రాజేష్ ఉన్నారు. కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాజానగరం ఇన్‌చార్జిగా చౌదరి

రాజానగరం: రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించిన పెందుర్తి వెంకటేష్ రాజీనామా చేశారు. కాగా చౌదరి నియామకంపై టీడీపీలో ఒక వర్గం హర్షం వ్యక్తం చేస్తుండగా, మరొకవర్గం ప్రతికూలతను వ్యక్తపరుస్తోంది.

చదరంగంతో మేధో వృద్ధి

బిక్కవోలు: చదరంగం ఆటతో మేధో వృద్ధి జరుగుతుందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పందలపాక శ్రీపడాల పెద ఫుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు దార్వంపూడి యువరాజారెడ్డి ఆధ్వర్యంలో చదరంగంపై అవగాహన కల్పించారు. కేవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

బంగారుకొండ.. భవిష్యత్తుకు అండ

- చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ముందుకు వచ్చిన దాతలు

మధురపూడి: పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి రూపొందించిన కార్యక్రమమే బంగారుకొండ. రేపటితరమైన చిన్నారుల భవిష్యత్తుకు అండగా నిలుస్తోంది. రేపటి సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో నిర్వహించబడుతోంది. సమాజంలోని మనసున్న మారాజుల సేవాదృక్పథానికి ఇది నిదర్శనం. ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..

రాజానగరం, రాజమహేంద్రవరం నియోజకవర్గాల్లో రెండు ఐసీడీస్ ప్రాజెక్టులున్నాయి. కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలు, రాజానగరం ప్రాజెక్టు పరిధిలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 270 మంది పిల్లలను బంగారుకొండలుగా గుర్తించారు. ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన ఎత్తు లేని వీరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి 255 మంది బాలమిత్ర (డోనర్లు) ముందుకు వచ్చారు. ఆ దాతల సాయంతో బంగారుకొండ కార్యక్రమం ద్వారా చిన్నారులకు ఆరునెలల పాటు పౌష్టికాహారం అందజేస్తారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.


రాజవరంలో బంగారుకొండ కిట్లు పంపిణీ చేస్తున్న కోరుకొండ సీడీపీఓ ఝాన్సీరాణి

ఐసీడీఎస్ ప్రాజెక్టు	మండలం	బంగారుకొండలు	బాలమిత్రలు
కోరుకొండ	కోరుకొండ	22	21
కోరుకొండ	సీతానగరం	54	50
కోరుకొండ	గోకవరం	11	11
రాజానగరం	రాజానగరం	89	86
రాజానగరం	రాజమహేంద్రవరం రూరల్	49	42
రాజానగరం	కడియం	45	45
మొత్తం	ఆరు మండలాలు	270	255

బాలమిత్రలు

బలహీనంగా ఉన్న పిల్లలను ఆరోగ్యవంతులను చేయడానికి సహకరిస్తూ, వారికి పౌష్టికాహారాన్ని అందించే డోనర్లను బాలమిత్రలు అంటారు. రాజానగరం జగ్గంపేట, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 270 మంది చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడానికి ప్రతినెలా రూ.3 వేలు అందజేయాలి. వీటితో పౌష్టికాహారాన్ని సమకూర్చుతారు.

అభినందనీయం



పేదింటి పిల్లల భవిష్యత్తుకు బంగారుకొండ కార్యక్రమం ఒక వరం. సాధారణంగా కుటుంబాల్లో పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతుంటారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆ పిల్లలను గుర్తించి, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి జరుగుతున్న కృషి అభినందనీయం.

– ముదే సింధూదివ్య, సర్పంచ్, కోటి కేశవరం

పౌష్టికాహార కిట్లలో ఇలా..

బంగారుకొండ కార్యక్రమంలో భాగంగా అరకేజీ కంది పప్పు, అరకేజీ బెల్లం, పావుకేజీ పెసర పప్పు, 100 గ్రాముల తేనె, 100 గ్రాముల నెయ్యి, పావుకేజీ వేరుశనగ అచ్చులు, అరకేజీ రాగిపిండి, అరకేజీ బన్సీరవ్వ తదితర వాటిని చిన్నారుల తల్లులకు అందిస్తారు. వాటితో పిల్లలకు ఆహారం తయారు చేసి అందించాలి. ప్రధానంగా స్వీట్ పొంగలి, కట్టు పొంగలి, కందిపప్పు కిచిడీ తయారు చేయాలి. ప్రతి బుధవారం పిల్లల బరువు, ఎత్తు తదితర వాటిని పరిశీలిస్తారు. ప్రతి 15 రోజులకోసారి వైద్యపరీక్షలు జరుపుతారు. దీని నిర్వహణకు ప్రత్యేకాధికారులను నియమించారు. కోరుకొండ మండలానికి వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, గోకవరం మండలానికి డ్వామా పీడీ సీహెచ్ రామ్‌గోపాల్, సీతానగరానికి ఎన్ఆర్ఈజీఎస్ పీడీ జి.శ్రీనివాస్‌ను నియమించారు.

ఆన్‌లైన్ జాబ్ పేరుతో రూ.6.18 లక్షల టోకరా

గోకవరం: ఆన్‌లైన్ జాబ్ పేరుతో యువకుడి వద్ద నుంచి రూ.6.18 లక్షలకు టోకరా వేసిన ఘటనపై స్థానిక పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గోకవరానికి చెందిన కొవ్వూరి హేమంత్ రామారెడ్డి బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ చదివి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతుండగా అతని వాట్సాప్ నంబర్‌కు ఒక జాబ్ లింక్ వచ్చింది. అతను ఆ లింక్‌పై క్లిక్ చేసి వారు చెప్పిన విధంగా వివరాలు నమోదు చేశాడు. తొలుత కొంత మొత్తం నగదు జమ చేస్తే అందుకు తగిన నగదు వస్తుందని నమ్మబలకడంతో దఫదఫాలుగా రూ.6.18 లక్షలు జమ చేశాడు. అయినప్పటికీ అతనికి నగదు తిరిగి రాకపోవడంతో పాటు తగిన సమాధానం చెప్పకపోవడంతో మోసపోయానని గుర్తించి గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు. యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాలుడి ఆత్మహత్య

సీతానగరం: కాటవరానికి చెందిన 15 ఏళ్ల బాలుడు బుధవారం తల్లిదండ్రులు ఇంటిలో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చిరంజీవి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. పదోతరగతి ఉత్తీర్ణుడైన బాలుడు ఇంటర్మీడియట్ చదివేందుకు ప్రైవేటు కాలేజీలో చేర్పించాలని తండ్రిని అడిగాడు. ఇల్లు కడుతున్నామని, దానికే డబ్బులు సరిపోవడం లేదని, వచ్చే ఏడాది చేర్పించి చదివిస్తానని ఆయన చెప్పాడు. దీంతో మనస్తాపంతో బాలుడు బుధవారం తల్లిదండ్రులు వేరే గ్రామంలో డబ్బులు కోసం బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఊరి నుంచి వచ్చిన తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని తలుపులు తీసే సరికి దూలానికి వేలాడుతున్న తన కుమారుడిని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా, తమ కుమారుడిని పోస్టుమార్టం చేయడం కుదరదని తండ్రితో పాటు, స్థానికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనితో గురువారం ఉదయం ఎస్సై చిరంజీవి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి వరదతో అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల రైతులు వరదతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు సూచించారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పశువులు, మేకలు, గొర్రెలను లంక భూముల నుంచి గ్రామాల్లోకి తీసుకురావాలని కోరారు. గోదావరి వరద ఉధృతమయ్యే అవకాశం ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారన్నారు. ఇప్పటికే గ్రామాల్లోని రైతులను ఆయా గ్రామాల వీఆర్వోలతో అప్రమత్తం చేశామన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, కాటవరం, మునికూడలి తదితర గ్రామాల రైతులకు సంబంధించిన పశువులను లంకభూముల నుంచి తీసుకురావాలన్నారు. ములకల్లంక, బొబ్బిల్లంక మధ్య ప్రజలు రాకపోకలకు వీలుగా రెండు పడవలను ఏర్పాటు చేశామన్నారు.

పేదల విద్యకు ప్రభుత్వ తోడ్పాటు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేదల విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థినులకు అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన ఎస్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎనలేనిదన్నారు. ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి మహిళలకు కుట్టు శిక్షణ, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ తదితర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ అధినేత సత్తి బులిస్వామిరెడ్డి, సభ్యులను ఆయన అభినందించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిండంలో భాగంగా విద్యా వ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అనంతరం ఏడో తరగతి విద్యార్థినులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధి సత్తి లక్ష్మణరెడ్డి, సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

జగన్ పాలనలో అన్నివర్గాలకూ లబ్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చినకొండేపూడిలో గడప గడపకూ..

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం చినకొండేపూడిలో ఐదోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. అర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు గడపగడపకూ వస్తున్నామన్నారు. ప్రజలకు ప్రభుత్వాలు జవాబుదారీతనంగా ఉండాలనే తలంపుతో ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. పథకాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకుఖాతాలకు జమ అవుతోందని, ఇటువంటి ప్రభుత్వమే మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండు రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు చిడిపి బంగారయ్య, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, మేడిశెట్టి చిన్నికృష్ణ, ముదునూరి ప్రసాదరాజు, నాగరాజు, తోరాటి శ్రీను పాల్గొన్నారు.


చినకొండేపూడిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెదపూడి: వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సచివాలయాల కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ డీఎల్‌పీఓ టి.అన్నామణి అన్నారు. పెదపూడి సచివాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపర్చాలన్నారు. వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ, వైరల్ జ్వరాలు సోకకుండా ముందుగానే తగిన చర్యలు చేపట్టాలన్నారు. మురుగు గుంతల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. తాగునీరు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. పథకాలకు సంబంధించిన వివరాలు తెలిపే బోర్డులు సచివాలయం బయట ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బాలాత్రిపుర సందరి తదితరులు పాల్గొన్నారు. .


పెదపూడి సచివాలయంలో కార్యదర్శులతో మాట్లాడుతున్న అన్నామణి

ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించండి

రంగంపేట: గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించాలని ఎంఈఓ పి.మధుసూదనరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రశస్తి యాప్‌నకు సంబంధించి ప్రత్యేకావసరాలు గల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమంపై అన్ని పాఠశాలల హెచ్ఎంలకు మండల స్థాయి శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఏళ్ల వయసున్న ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలో నమోదు చేయాలన్నారు. దీనిని ఈ నెల 28 లోపు నిర్వహించాలన్నారు. పాఠశాల స్థాయిలో ప్రశస్తి యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడూ డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి విద్యార్థినీ స్క్రీనింగ్ చేయాలన్నారు. దీనివల్ల ప్రత్యేకావసరాలు గల పిల్లలకు సదుపాయాలు, సౌకర్యాలు సకాలంలో అందుతాయని అన్నారు. హెచ్ఎంలు, ఐఈఆర్‌టీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

బిక్కవోలు: బలభద్రపురంలో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. నాగులపల్లి నాగేంద్ర, కురందాసు నాగమురళీ, అంసూరి వెంకట వంశీలను అరెస్టు చేసి వారి నుంచి రూ.2650 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

రంగంపేట: జి.దొంతమూరులో మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ప్రారంభించినట్లు మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి తెలిపారు. ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత వీరంపాలెంలో గత ఏప్రిల్‌లో మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చామని, దానికి మంచి స్పందన రావడంతో జి.దొంతమూరులో రెండో బ్యాచ్ ప్రారంభించామన్నారు. 50 మంది మహిళలు శిక్షణకు హాజరయ్యారని, ఇకపై ప్రతి సోమ, గురువారాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

గోకవరం: గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పీఎంపీకి కమ్యూనిటీ పారామెడికల్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన పీఎంపీ పేరారపు లక్ష్మణ్‌రావు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న తోటి పీఎంపీ సభ్యులు రూ.20,500 నగదును గురువారం జిల్లా కో కన్వీనర్ బళ్ల శ్రీనివాస్‌రావు, మండల గౌరవాధ్యక్షుడు పి.చిన్ని చేతుల మీదుగా అందజేశారు. సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన చేరిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. తహసీల్దార్ ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం రఘుదేవపురంలో జగనన్న సురక్ష గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్షతో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కొందరు నాయకులు డబ్బులు విసిరి, ఫ్లెక్సీలు కట్టించుకుని, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లతో రాత్రికి రాత్రి నాయకులమైపోదామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రఘుదేవపురంలో గత ప్రభుత్వం కంటే 15 రెట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీతానగరం మండల ప్రజల చిరకాల కోరికైన రాజమహేంద్రవరం నాలుగు లైన్ల రహదారిని మరో మూడు నెలల్లో పూర్తిచేస్తామని భరోసానిచ్చారు. సీతానగరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చి, 30 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని రఘుదేవపురంలో ఏడు నెలల్లో పూర్తి చేసి, స్పెషలిస్టు వైద్యుల సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. గ్రామంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ముగ్గళ్ల – కూనవరం మధ్యలో శుద్ధమెట్ట వద్ద ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గోపిశెట్టి అచ్చారావు మాట్లాడారు. బొబ్బిల్లంక 2లో ఎంపీడీవో కే.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సభలో లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఎంపీటీసీ యలమాటి శిరీష, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి అంబటి రమణ,నాయకులు పాల్గొన్నారు.


రఘుదేవపురంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్నట్టు ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం కోరుకొండ-2, కాపవరం సచివాలయాల్లో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెదపూడి: ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. రాజుపాలెంలో జగనన్న సురక్ష గ్రామసభను సర్పంచ్ గుత్తుల పుష్పవతి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం 545 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీటీసీ సభ్యురాలు బి.భవానీ, ఉప సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు, సచివాలయ కార్యదర్శి ఎస్వీ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలులోకి తెచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. గురువారం జి.దొంతమూరులో 1, 2 గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం అర్హులకు ధ్రువీకరణ అందించారు. ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కోరుకొండ-2 సచివాలయంలో సర్టిఫికెట్ల ప్రదానం


బిక్కవోలులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరసుబ్బారెడ్డి

బిక్కవోలు: జగనన్న సురక్షతో పేదలకు మేలు జరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి అన్నారు. బిక్కవోలు సచివాలయం -2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 1,128 ధ్రువీకరణ పత్రాలు అందించారు. సర్పంచ్ సరెళ్ల సుమలత, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, ఎంపీడీఓ జెఏ ఝాన్సీ, డీటీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆరికరేవులలోనూ జగనన్న సురక్ష నిర్వహించారు.

వలంటీర్లకు వందనం

ఇంటికెళ్లి... సేవలందించి

కరోనా ముట్టుముట్టిన వేళ.. అయిన వారూ దూరంగా ఉంటున్న సమయంలో వైరస్ బాధితులకు వలంటీర్లు అందించిన సేవలు ఎనలేనివి. జి.మామిడాడ డీఆర్‌కే నగర్‌లో వలంటీర్‌గా జి.రామలక్ష్మి పని చేస్తుంది. అప్పట్లో కరోనా బాధితులకు నిబంధనలు పాటిస్తూ ఆమె స్వయంగా కూరగాయలు, పాలు, నిత్యావసర సరకులు పంపిణీ చేసింది. లాక్‌డౌన్ నిబంధనలు ఒకపక్క, ఇంట్లో వాళ్లకి కరోనా నేపథ్యంలో ఎవరూ బయటకు వెళ్లి ఏ వస్తువులు తెచ్చుకోవడానికి అవకాశం లేని సమయంలో రామలక్ష్మి అందించిన సేవలు అద్భుతం. అలాంటి వలంటీర్లకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


శ్యామల కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న వలంటీర్ రామలక్ష్మి(ఫైల్)

సేవా సారథులు వలంటీర్లు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందించే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. దీనిద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందుతున్నాయి. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైరస్ సోకిన వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన నిత్యావసరాలు అందజేసి మనోధైర్యం నింపారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న గిన్నెలో పాలు పోస్తున్న యువకుడి పేరు పి.వెంకట్రావు. అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన ఈ వలంటీర్. కరోనా సమయంలో గ్రామంలో కోవిడ్ సోకి హోం క్వారంటైన్‌లో ఉన్న బాధితులకు సేవలందించాడు. బాధితులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని కావాల్సిన మందులు, నిత్యావసరాలు అందించాడు.


కోవిడ్ సోకిన వ్యక్తి ఇంటికి వెళ్లి పాలు పోస్తున్న వలంటీర్ వెంకట్రావు

ఆరోగ్య సమస్యలు తెలుసుకుని..



నేను ఫస్ట్ వేవ్‌లో కోవిడ్ బారిన పడి హోం క్వారంటైన్‌లో ఉన్నా. కరోనా మహమ్మారి సోకడంతో కుటుంబ సభ్యులు, బంధువులు సైతం భయపడే పరిస్థితి. ఇటువంటి విపత్కర సమయంలో వలంటీర్ మా ఇంటికి వచ్చి నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మందులు కిట్లు అందించి సహకరించారు. కోవిడ్ సమయంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న అనేక మందికి వలంటీర్లు అందించిన సేవలు ఎనలేనివి.

–గుడిమెట్ల రుద్రారెడ్డి, ట్రాన్స్‌ఫార్మర్ వీధి, కొప్పవరం